క్లుప్తంగా

సీపీని కలిసిన ఎస్సై



వరంగల్ క్రైం/శాయంపేట : శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జక్కుల పరమేష్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ప్రజలకు పోలీసులపై ఉన్న నమ్మకానికి తగ్గట్లుగా నిజాయితీతో పనిచేయాలని సీపీ ఎస్సైకి సూచించారు.

పరకాల ఏసీపీని కలిసిన నాగరాజు



శాయంపేట : పరకాల ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌బాబును యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాదు నాగరాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందించి శాలువాతో సత్కరించారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు పల్లెబోయిన సారయ్య, మాజీ సర్పంచ్ అరికిళ్ల వీరయ్య, గజ్జి శంకర్, అబ్బోజు చంద్రమౌళి మర్యాపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

నూతన ఆర్ఓఆర్‌తో భూ సమస్యల పరిష్కారం

ఐనవోలు : తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్–2024 చట్టంతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ట్రెంగా జిల్లా అధ్యక్షుడు, మండల ఆర్ఐ మరుపట్ల మల్లయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ భూములే కాకుండా గ్రామకంఠం, ఆబాది భూములకు కూడా చట్టబద్ధత కల్పించి రుణాలు పొందే విధంగా చట్టాన్ని తేవడం సంతోషదాయకం అన్నారు. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మల్లయ్య పేర్కొన్నారు.

ఆర్థికసాయం

దామెర : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబానికి అండగా నిలుస్తామని రెడ్డి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు, ఒగ్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేపతిపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ గ్రామానికి చెందిన మన్నెం అనంత రెడ్డి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా విషయం తెలుసుకొన్న శ్రీధర్ రెడ్డి గురువారం బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అనంతరం రూ.5,000లు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కిన్నెర రమేష్, కేతిపల్లి రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



సుశీల (ఫైల్)

దామెర : మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొక్కొండ సుశీల(106) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం మృతిచెందింది. కాగా సుశీలకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మనుమళ్లు, మనువరాళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి..

సంగెం: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతలపల్లికి చెందిన వేల్పుల రాజాలు(80) అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈనెల 17న రాత్రి భార్య లక్ష్మమ్మ నిద్రపోయిన తర్వాత రాజాలు పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటున్నాడు. గమనించిన భార్య, సమీప బంధువుల సాయంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ



వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన బక్క వెంకట్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వెంకట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జల్తారి సంపత్, కాంగ్రెస్ నాయకులు మండల సంపత్, ఆవుల రాజయ్య, నకీర్త రాజు, మ్యాకల యాదయ్య ఉన్నారు.

నేడు కుట్టుమిషన్ల పంపిణీ

పరకాల : ఎన్నికల ముందు ఓ ప్రైవేట్ చారిటబుల్ ట్రస్టు ద్వారా కుట్టుశిక్షణ పొందిన మహిళలకు నేడు(శుక్రవారం) పరకాల పట్టణంలోని ఆర్.ఆర్ గార్డెన్‌లో ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు



ఓటును వినియోగించుకుంటున్న విద్యార్థి

- జెడ్పీ హైస్కూల్‌లో మాక్‌పోలింగ్

ధర్మసాగర్ : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైందని పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధర్మప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ స్టూడెంట్ క్యాబినెట్ కోసం ధర్మప్రకాశ్ అధ్యక్షతన గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పది రోజులుగా విద్యార్థి అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల స్వీకరణ, గుర్తుల కేటాయింపు, బరిలో నిలిచిన అభ్యర్థులచే విద్యార్థుల అభ్యున్నతికి వారు ఏం చేస్తారో ప్రత్యక్షంగా ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్, గెలిచిన అభ్యర్థులకు ఫలితాల ప్రకటన వంటి వివిధ అంశాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అర్థమయ్యేలా తర్ఫీదు ఇచ్చారు. ఈ మాదిరి ఎన్నికల్లో పదో తరగతి చదువుతున్న సిద్ధు, కార్తీక్ తొమ్మిదో తరగతి, మనోజ్ ఎనిమిదో తరగతి వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఓట్లు సాధించి స్కూల్ స్టూడెంట్ క్యాబినెట్‌కు ఎన్నికయ్యారు. ముగింపు సమావేశంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, కవిత, సురేష్, పద్మజ, రాజమ్మ, కిరణ్మయి ఎన్నికల సరళిని ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించుకుంటే ప్రజాస్వామ్యం ఎలా పరిఢవిల్లుతుందో అవగాహన కల్పించారు. సమాజ అభివృద్ధిలో విద్యార్థులుగా వారి భాగస్వామ్యం ఏమిటి అనే విషయాలను మాదిరి ఎన్నికల ద్వారా తెలియజేశారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- ఎంఈఓ లకావత్ రాజేశ్ కుమార్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

దామెర : నూతనంగా అమలుచేసిన మెనూ ప్రకారం విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో భోజనం అందించాలని ఎంఈఓ లకావత్ రాజేశ్ కుమార్ అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నూతన మెనూను తప్పకుండా పాటించాలని సూచించారు. వంటగది, వంట పాత్రలు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. నాణ్యమైన భోజనం అందించి విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి కృషిచేయాలని వెల్లడించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

- పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాస్



నట్టల నివారణ మందు వేస్తున్న వైద్యులు, సిబ్బంది

కమలాపూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్యశిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఏడీ పి.శ్రీనివాస్ సూచించారు. కమలాపూర్ మండలంలోని గుండేడులో పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పశువుల గర్భకోశ వ్యాధులకు, ఎదకు రాని పశువులకు చికిత్సలు, చూడి పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందు, బాహ్య పరాన్న జీవులకు స్ప్రే మందు పిచికారీ చేశారు. మొత్తంగా 86 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ డీఎల్‌డీఏ కరీంనగర్ డాక్టర్ ఎస్ఎస్‌పీ రెడ్డి, ఉప్పల్ పశు వైద్యాధికారి ప్లవస్ మజుందార్, పశువైద్యులు రాజేష్, పార్థసారథి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాంరెడ్డి, గోపాలమిత్రలు పెర్క చక్రపాణి, శ్రీనివాస్, పాడి రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ నారాయణ

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ కె.నారాయణ సూచించారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పూర్తి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. అవసరమైన భూమి పత్రాలు, ఆహార భద్రత కార్డు, ఇంటి యజమానురాలి ఫొటో సేకరించి యాప్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ సుష్మా, కౌన్సిలర్ మార్క రఘుపతి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఇనుగాల రమాదేవి, కొక్కిరాల స్వాతి, అమీనా, ఆకుల అశోక్, ఆర్పీ రుక్మిణీ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజేశ్



ధర్మసాగర్ : మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బొల్లెపాక రాజేశ్‌ను తెలంగాణ రాష్ట్ర మాదిగ జర్నలిస్ట్ ఫోరం ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిజంలో ఉన్నత సేవలు అందించడంతో పాటు మాదిగ సమాజ అభ్యున్నతికి చేసిన కృషిని గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాగేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ సమాజ సేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగుతానని అన్నారు.తన ఎన్నికకు సహకరించిన ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నాగేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

దేవుడి ఆభరణాల దొంగ అరెస్టు

- మూడు మండలాల ఆలయాల్లో చోరీ

గీసుకొండ: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి గ్రామానికి చెందిన కొలిపాక రాజు పలు ఆలయాల్లో చోరీ చేశాడు. కమలాపూర్, గీసుకొండ, ముల్కనూరులోని పలు ఆలయాల హుండీలను పగులగొట్టి నగదుతోపాటు దేవుడి బంగారు, వెండి ఆభరణాలు, సామాను ఎత్తుకెళ్లి కొంతకాలంగా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ ఏడాది సెప్టెంబర్ 21న రాత్రి గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట కట్టమల్లన్న ఆలయం పక్కన ఉన్న రేణుకాఎల్లమ్మ ఆలయం తాళాలు పగులగొట్టి దేవతామూర్తులు, బంగారు, వెండి ఆభరణాలను అపహరించి పరారయ్యాడు. గీసుకొండ పోలీసులు వరంగల్–నర్సంపేట రహదారిలోని ఊకల్ క్రాస్‌రోడ్డులో గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌పై రాజు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకున్నారు. విచారించగా ఆలయాల్లో చోరీ బాగోతం బయటపడిందని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

ఉప్పల్‌లో చోరీ



కమలాపూర్ : ఉప్పల్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో ఇద్దరు మహిళలు చొరబడి గురువారం పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతరాజు కుమారస్వామి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో చిత్తు కాగితాలు సేకరిస్తూ చిల్లర దొంగతనాలకు పాల్పడే మహిళలు ఉప్పల్‌లోని కుమారస్వామి ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించారు. తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి పాత బిందెలు, బకెట్లు, గిన్నెలు ఇతర సామగ్రి చోరీ చేశారు. గమనించిన స్థానికులు దొంగలు, దొంగలు అంటూ కేకలు వేయడంతో సామగ్రిని అక్కడే వదిలేసి మహిళలు పారిపోయారు. గ్రామస్తులు వారిని వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మహిళలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

గుడుంబా స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ సంతోష్

ఆత్మకూరు : అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయించేందుకు తరలిస్తున్న వ్యక్తిని ఆత్మకూరు పోలీసులు గురువారం అరెస్టు చేసి గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన ఇస్లావత్ సక్కు నుంచి 56 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో కూడా పలు పోలీస్‌స్టేషన్లలో గుడుంబా కేసులు ఉన్నట్లు సీఐ సంతోష్ తెలిపారు.

మిర్చి సాగుపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

నడికూడ : మండల కేంద్రంలోని రైతువేదికలో వరంగల్ ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మిర్చి పంట సాగు చేస్తున్న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త కత్తుల నాగరాజు మాట్లాడారు. మిర్చి సాగు చేసే రైతులు పంట నారుమడి దశ నుంచే సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులతో నల్లి తెగులు వ్యాప్తి చెందుతుందని వాటి నివారణకు ఎకరం తోటలో 40–50 నీలిరంగు, పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పంట చుట్టు రక్షక పంటగా జొన్న, మొక్కజొన్న వేసుకోవాలని, వ్యవసాయ అధికారులు సిఫారసు చేసిన మందులను మాత్రమే సూచించిన మోతాదుకు మించకుండా పిచికారీ చేస్తేనే నల్లి నివారణను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన సందేహాలకు వారు సమాధానాలిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు వెంకటేశం, రాకేశ్, తాడూరి మధులిక, మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీఎంపీఎస్ నాయకుల అరెస్ట్



ఐనవోలు : గొల్ల కురుమల సమస్యలు పరిష్కరించాలని కోరితే ముందస్తు అరెస్టులు చేసి నిర్బందిస్తారా? అని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం మండల అధ్యక్షుడు పిడుగు దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చలో హైదరాబాద్ పిలుపులో భాగంగా గురువారం జీఎంపీఎస్ నాయకులను అక్రమంగా పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించడం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమ నిర్బంధాలు చేస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లిస్తుందని హెచ్చరించారు. గొర్రెల పంపిణీకి బదులు రూ. 2లక్షల నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కావటి ఐద్వేల్, కోల సంపత్, చిన్న రాజు ఉన్నారు.

కొండ చిలువల కలకలం



కమలాపూర్: కమలాపూర్‌లో కొండ చిలువల సంచారం పెరిగింది. వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంతంలో కొండ చిలువలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. దీంతో ఆప్రాంతంలోని రైతులతో పాటు ఆమార్గంలో ప్రయాణించే వాహనదారులు భయభ్రాంతులకు లోనవుతున్నారు. గురువారం రాత్రి సుమారు 10 ఫీట్ల పొడవున్న ఓ భారీ కొండ చిలువ రోడ్డు దాటుతుండగా వాహనదారులు వాహనాల్ని నిలిపివేశారు. సంబంధిత అటవీ శాఖ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో సంచరిస్తున్న కొండ చిలువలను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

పంచకూట శివాలయంలో మండలపూజ



హోమం వద్ద పూజలు చేస్తున్న వేదపండితులు



పూజలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీమహాదేవ స్వామి ఆలయంలో పునఃప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం 41 రోజులకు గురువారం మండల పూజా కార్యక్రమాన్ని పండితులు ఘనంగా నిర్వహించారు. మహాగణపతి పూజ, పుణ్యాహ వాచనం, మంటపారాధన, మహారుద్ర నవగ్రహ సహిత హోమం, 108 కలశ సహిత రుద్ర నమక చమక సహిత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాదర్శనం, మహాదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమా లను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. అ నంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు. అర్చకులు వచ్చునూరు రవీందర్ శర్మ, శ్రా వణ్ శర్మ, వేద పండితులు శివకిరణ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అనిత



బహుమతి, ప్రశంసపత్రం అందుకుంటున్న భరత్

ఆత్మకూరు : హనుమకొండలో జరిగిన సీఎం కప్–2024 జిల్లా స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని గుడెప్పాడ్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు శ్రావ్య (మొదటి), దివ్య (రెండో స్థానంలో) గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులను, కరాటే కోచ్ సుమన్‌ను గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

కమలాపూర్ : జిల్లా బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కమలాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్.భరత్ అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లా ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత గురువారం తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు భరత్ బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో 50 మార్కులకు గాను 47 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి పోటీలకు ఎంపికయ్యారుడు. డీఈఓ వాసంతి చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన భరత్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు సైన్స్ ఉపాధ్యాయులు అభినందించారు.

అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు



దామెరలో మాట్లాడుతున్న తిరుపతి



పరకాల: అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీఎస్పీ కార్యకర్తలు



ఎల్కతుర్తి: ముల్కనూర్‌లో దిష్టిబొమ్మతో ధర్నా నిర్వహిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి

దామెర : డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ..పార్లమెంట్‌లో అమిత్‌షా అంబేడ్కర్‌పై అనుచితంగా మాట్లాడటం సరికాదని అన్నారు. మనువాద భావజాలాన్ని మనసులో పెట్టుకొని అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కులను రాజ్యాంగంలో పొందుపరిచి వారి అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, మండల నాయకులు ఇమ్మడి తేజ్‌పాల్, సాధం సాయికృష్ణ, బండి రాజ్‌కుమార్, విష్ణువర్ధన్, సురేష్, వర్షిత్, శివకుమార్, నాగచైతన్య తదితరులు ఉన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి: తిరుపతి

శాయంపేట : పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ..అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవిస్తుంటే బీజేపీ ప్రభుత్వం, కేంద్ర మంత్రులు నీచంగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. సబ్బండ వర్గాలకు రాజ్యాంగంలో హక్కులు కల్పించి ప్రతిపౌరుడు స్వేచ్ఛగా, సమానత్వంతో, సోదరభావంతో మెలిగేలా చేశారని గుర్తుచేశారు. అమిత్ షా వ్యాఖ్యాలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, మండల ఉపాధ్యక్షుడు పల్లెబోయిన అభి, సహాయ కార్యదర్శి దాసరి ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన

పరకాల : బాబాసాహెబ్ అంబేడ్కర్ పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పరకాల పట్టణంలో బీఎస్పీ కార్యకర్తలు కేంద్ర మంత్రి అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేశారు. గురువారం అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేసిన బీఎస్పీ కార్యకర్తలు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఆయన చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగరపు రాజు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బేషరతుగా అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పసుల వినయ్, నియోజవర్గ ఇన్‌చార్జ్ కర్రె రమేశ్, కార్యదర్శి విష్ణు, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, బీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద సురేష్, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్‌షాపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలి

ఎల్కతుర్తి : కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంబేడ్కర్ సంఘం నాయకులు గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ఎల్కతుర్తి–హుస్నాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా రాస్తారోకో చేపట్టారు. అనంతరం అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేసి, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేడ్కర్‌ను అవహేళన చేసి మాట్లాడిన అమిత్‌షాను హోం మంత్రి పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం మండల కన్వీనర్ ఎల్తూరి ప్రేమ్‌రాజ్, జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేగల సారయ్య, నాయకులు తూముల సదానందం, ఎల్లన్న, సుధాకర్, అశోక్, భిక్షపతి, చక్రపాణి, శంకర్, కొలుగూరి రాజు, వెంకటస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న ఎస్సై అశోక్

దామెర : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఎస్సై కొంక అశోక్ తెలిపారు. మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల నేస్తం–చైల్డ్ లైన్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. బడి ఈడు పిల్లలు బడికి వెళ్లాలని, బాల్య వివాహాలు, బాల కార్మికులుగా పనిచేయడం చట్ట ప్రకారం నేరమని వెల్లడించారు. వ్యసనాల బారిన పడకుండా కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జ్ వెంకన్న, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, 1098 ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఉన్నారు.